సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం ၊ 29 ၊ జూలై ၊ 2024



పాపికొండలు 'పులి'కింత

పెద్ద పులి గాండ్రింపులతో పాపికొండల అభయారణ్యం పులకరిస్తోంది. ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా పెద్ద పులి జాడల్ని గుర్తించారు. 8లో



దిగుబడికి కాలి'బాటలు'

వరి పొలంలో కాలిబాటలతో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే చాలా మంది ఆసక్తి చూపడం లేదు. 8లో



విధి మిగిల్చిన విషాదం

తాడేరుకి చెందిన ముగ్గురు అన్నదమ్ములు తల్లితో కలిసి వేరే గ్రామానికి పని కోసం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. 8లో

న్యూస్‌రీల్

సూర్యనారాయణ సస్పెన్షన్ వార్త అవాస్తవం



ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాజు

భీమవరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను సస్పెండ్ చేసినట్లు వచ్చిన వార్తలు అవాస్తవం అని, బైలా ప్రకారం రాష్ట్ర అధ్యక్షుడిని తొలగించే అధికారం కార్యవర్గానికి తప్ప ఎవరికీ లేదని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు అన్నారు. భీమవరంలోని అంకాల ఆర్ట్ అకాడమీలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి బీహెచ్ రవీంద్రరాజు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో మెజార్టీ సభ్యులు ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు చేస్తున్న అసోసియేషన్ వ్యతిరేక కార్యక్రమాలపై రాత పూర్వక ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఆస్కార్‌రావును పదవి నుంచి తొలగించారన్నారు. జిల్లా కార్యదర్శి పీఎస్ చంద్రమౌళి మాట్లాడుతూ సూర్యనారాయణకు పూర్తి మద్దతు తెలియజేస్తూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశామన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గంలో ఖాళీ పోస్టులను భర్తీ చేశారు. ఎన్నికల అధికారిగా రవీంద్రరాజు వ్యవహరించారు.

513 మి.మీ వర్షపాతం

భీమవరం: జిల్లావ్యాప్తంగా ఆదివారం 513.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పాలకొల్లులో అత్యధికంగా 70.4 మి.మీ వర్షం కురవగా, మండలాల వారీగా తాడేపల్లిగూడెంలో 13.2, పెంటపాడులో 17.4, తణుకులో 25.2, అత్తిలిలో 24.2, గణపవరంలో 21.8, ఆకివీడులో 15.4, ఉండిలో 16.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పాలకోడేరులో 23.4, పెనుమంట్రలో 38.2, ఇరగవరంలో 23.4, పెనుగొండలో 28.8, ఆచంటలో 40, పోడూరులో 25.4, వీరవాసరంలో 30.6, భీమవరంలో 23.4, కాళ్లలో 12.2, మొగల్తూరులో 8.6, నరసాపురంలో 20.2, యలమంచిలిలో 35.2 మి.మీ వర్షం కురిసింది.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు



దాత కృష్ణంరాజుకు విరాళం బాండ్ అందిస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా ఆదివారం రూ.6,10,116లను విరాళంగా అందజేశారు. గుంటూరుకు చెందిన ఆలపాటి వెంకటరత్నం రూ.5 లక్షలు, కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన మంతెన అహోబిల కృష్ణంరాజు రూ.1,10,116లను ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలు వెంకటరత్నంకు ఈఓ వేంద్ర త్రినాథరావు, కృష్ణంరాజుకు ఏఈఓ ఎం.దుర్గారావు విరాళం బాండ్‌లు అందించారు. దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

మహిళను బెదిరించి.. సీబీఐ అని భయపెట్టి..

రూ.25.60 లక్షలు స్వాహా

ఏలూరు టౌన్: ఏలూరుకి చెందిన ఓ మహిళను తాము సీబీఐ అధికారులమంటూ బెదిరించి భారీ ఎత్తున సొమ్ములు స్వాహా చేసిన ఉదంతమిది. దీనిపై బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు విద్యానగర్‌కు చెందిన పాము సెల్వరోజిలిన్ అనే మహిళకు ఈనెల 18న గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. తాము ముంబై నుంచి ఫోన్ చేస్తున్నామనీ, మీ పేరుతో పెడెక్స్ కొరియర్ సర్వీసుకు విదేశాల నుంచి కొరియర్ వచ్చిందని చెప్పారు. తాము సీబీఐ అధికారులమని, కొరియర్ బాక్సును తనిఖీ చేయగా పాస్‌పోర్టులు, పాన్‌కార్డులు, క్రెడిట్ కార్డులు, ప్రమాదకరమైన డ్రగ్స్ ఉన్నాయనీ, దీంతో మీపై కేసు నమోదు చేస్తున్నామంటూ బెదిరించారు. అనంతరం వీడియో కాల్ చేసి పార్సిల్‌లో ఉన్న వస్తువులను చూపించారు. పైగా ఫోన్ చేసిన వారంతా యూనిఫామ్‌లో ఉండటంతో ఆమె తీవ్ర భయాందోళనకు గురైంది. కేసు లేకుండా చేయాలంటే డబ్బులు చెల్లించాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు బెదిరించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన సెల్వరోలిజిన్ వారు చెప్పిన బ్యాంకు ఖాతాకు రూ.25,60,500ను పంపారు. అనంతరం విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి



సిద్ధాంతం మధ్యస్థలంకలో ముంపులో కూరగాయల తోటలు

బిక్కు బిక్కుమంటూ..



యలమంచిలి మండలంలో బాడవ ప్రధాన రహదారి ఇలా..

- జలదిగ్బంధంలో లంక గ్రామాలు
- తాగునీరు, పశుగ్రాసం కొరతతో అవస్థలు
- పాములు, విష పురుగుల భయంతో బెంబేలు
- గత ప్రభుత్వ హయాంలో బాధితులకు సత్వర సాయం
- బాధితుల అవస్థలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఆచంట మండలం మర్రేమూలలో తాగునీటి కోసం గ్రామస్తుల ఇక్కట్లు



ఆచంట మండలం అయోధ్యలంకలో పడవపై పర్యటిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్



యలమంచిలి మండలం పెదలంకలో జలమయమైన రోడ్డు

పెనుగొండ: గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. లంక గ్రామాలను ముంచుకుంటూ సముద్రం వైపు వేగంగా ప్రవహిస్తోంది. దీంతో ధవళేశ్వరం బ్యారేజీ దిగువ ప్రాంతాల్లోని లంక గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. మొదటి దశలోనే గోదావరి వరద తాకిడికి గురైన ప్రాంతాల్లో ప్రభుత్వం కన్నెత్తి చూడకపోవడంతో లంక గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో మరోమారు వరద నీరు పోటెత్తడంతో తాగునీరు, ఆహారం, పశుగ్రాసం కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 15.26 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదలడంతో ఆచంట, యలమంచిలి మండలాల్లోని లంక గ్రామాలకు వరద ముంచుకొస్తోంది. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికే ఆచంట మండలంలో భీమలాపురం కాపులపాలెం, మర్రేమూల, అయోధ్యలంకలో కొంత భాగం వరద నీటితో నిండిపోయింది. రోడ్లన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కలెక్టర్ చదలవాడ నాగరాణి అయోధ్యలంక, మర్రేమూల ప్రాంతాల్లో పర్యటించారు. ఆచంట మండలంలో పెదమల్లంలంక, అనగార్లంక, అయోధ్యలంక పరిధిలో, అయోధ్యలంక, పుచ్చలంక, మర్రేమూల, పెదపేట నక్కిడిలంక, రాయిలంక, నేతలవారిపేట, కోడేరు పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం, భీమలాపురంలోని కాపులపాలెం, యలమంచిలి మండలంలోని కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, బాడవ గ్రామాల్లోని ఇళ్లలోకి సోమవారం ఉదయానికి నీరు చేరవచ్చని అంచనా వేస్తున్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

ఆచంట మండలంలోని లంక గ్రామాల్లోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాలు నీట మునగడంతో సరఫరాను నిలిపివేశారు.

తాగునీటికి కటకట

చుట్టూ గోదావరి ఉన్నా గుక్కెడు నీరు దొరకని పరిస్థితి లంక గ్రామాల్లో నెలకొంది. తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వరదల సమయంలో ముంపు ప్రాంతాల్లో తాగునీటి ప్యాకెట్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని ప్రజలు అంటున్నారు.

రహదారుల జలమయం

లంక గ్రామాల్లో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఆచంట మండలంలో పెదమల్లంలంక, భీమలాపురం, కాపులపాలెం, అయోధ్యలంక, మర్రేమూల, అణగార్లంక, పుచ్చల్లంక, పెదపేట, యలమంచిలి మండలంలోని కనకాయలలంక, బాడవ ప్రాంతాలతో పాటు, లక్ష్మీపాలెం, పెదలంకల్లోని రోడ్లన్నీ వరదతో నిండిపోయాయి.

పశుగ్రాసం కొరత

లంక గ్రామాల్లో పశుగ్రాసం కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. లంక గ్రామాల్లో రెండు వేలకు పైగా పాడి పశువులు ఉన్నాయి, సిద్ధాంతం మధ్యస్థలంకతో పాటు అయోధ్యలంక, పెదమల్లం, పల్లేపాలెం, కనకాయలంకల్లో పాడి రైతుల సంఖ్య ఎక్కువ. పశు సంవర్ధకశాఖ నుంచి పశుగ్రాసం పంపిణీకి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. గత ప్రభుత్వంలో ఆచంట మండలంలోని లంక గ్రామాల్లో 44 టన్నుల టీఎంఆర్ పశువుల మేతను 518 మంది రైతులకు పంపిణీ చేశారు. సిద్ధాంతంలో 10 టన్నుల టీఎంఆర్ పశువుల మేతను పంపిణీ చేశారు. అయితే దీనిపై కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే పాములు, విషపురుగుల బెడద పొంచి ఉండటంతో ముంపు ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆరు రోజులుగా వరద నీటిలోనే..

యలమంచిలి: మండలంలోని లంక గ్రామాలను వరద వీడటం లేదు. కనకాయలంక, పెదలంక, దొడ్డిపట్ల మత్స్యకార కాలనీ, గంగడుపాలెం ఏటిగట్టు దిగువ ప్రాంతం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, బాడవ గ్రామాల్లో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 6,105 కుటుంబాలపై వరద ప్రభావం పడినట్లు గుర్తించామని తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో ఆయిల్, కిలో బంగాళదుంపలు, కిలో ఉల్లిపాయలు అందిస్తున్నామన్నారు. కనకాయలంక, పెదలంక, దొడ్డిపట్ల గ్రామాల్లో ఆదివారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. వరద బాధితులను పరామర్శించి ప్రభుత్వం తరఫున నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

లంక ప్రజలను ఆదుకుంటాం : కలెక్టర్

గోదావరి ఉధృతితో ముంపునకు గురవుతున్న లంక గ్రామాల ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటామని కలెక్టర్ చదలవాడ నాగరాణి భరోసా ఇచ్చారు. ఆదివారం ఆచంట మండలంలోని అయోధ్యలంకలోని ముంపు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. కోడేరు రేవు నుంచి పడవపై అయోధ్యలంక మర్రేమూల చేరుకుని అక్కడ ట్రాక్టర్‌పై పర్యటించారు. మర్రేమూలలో మహిళలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. గోదావరికి వంతెన లేకపోవడంతో ఏటా వరద సమయంలో ఇబ్బంది పడుతున్నామని, తాగునీటి సమస్య ఉందని మహిళలు ఆమె వద్ద వాపోయారు. ముంపు ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికీ 25 కిలోల బియ్యం, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, నూనె, కందిపప్పు, నిత్యావసర సరుకులు ఇస్తామన్నారు. వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని, పశుగ్రాసం కొరత లేకుండా చూస్తామన్నారు. ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. అంగన్‌వాడీ ప్రీ స్కూలులో ఏర్పాటుచేసిన ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించి అత్యవసర మందులపై ఆరా తీశారు. నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్, ఆచంట తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ పి.నరసింహప్రసాద్, సీహెచ్ పద్మశ్రీ ఉన్నారు.



ఆచంట మండలం మర్రేమూలలో ఇళ్ల మధ్యకు చేరిన వరద



సిద్ధాంతంలో మధ్యస్థలంకలోకి రైతులు వెళ్లడానికి నిలిచిన పడవలు

టిడ్కో ఇళ్ల పంపిణీ ఆలస్యం

మంత్రి నిమ్మల రామానాయుడు



చెక్కును మంత్రికి అందిస్తున్న చాంబర్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: టిడ్కో లబ్ధిదారులకు శ్రావణ మాసంలో ఇళ్లు అందించాలని భావించామని, అయితే నిధుల కొరతతో ఆలసమయ్యే అవకాశం ఉందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో చాంబర్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం, ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారులకు శ్రావణమాసంలో ఇళ్లు పంపిణీ చేస్తామని, గత ప్రభుత్వంలో చేసిన టిడ్కో రుణాలను మాఫీ చేస్తామని చెప్పామని, దీనిపై మున్సిపల్ శాఖ మంత్రిని కూడా కలిశామన్నారు. అయితే రాష్ట్రంలో టిడ్కో గృహాలపై రూ.5,200 కోట్లు అప్పు చేశారని, పాలకొల్లుకు సంబంధించి రూ.180 కోట్లు అప్పు తీసుకున్నారని అన్నారన్నారు. ఈ అంశాలు కొద్దిగా కష్టతరమైనా నాడు మాట ఇచ్చాం కాబట్టి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని మంత్రి నిమ్మల చెప్పారు. దీంతో శ్రావణమాసంలో టిడ్కో గృహాలు అందనట్టేనని, అలాగే రుణాలు రద్దు కూడా లేనట్లేనా అనే సందేహం లబ్ధిదారుల్లో కలిగింది. ఇదిలా ఉండగా పలు సమస్యలను చాంబర్ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకురాగా రాష్ట్రంలో నిధుల కొరత ఉందని, నెమ్మదిగా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. చాంబర్ తరఫున సభ్యులు అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం చెక్కు అందించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ రాకపోవడం చాంబర్ సభ్యులను నిరుత్సాహపరిచింది. చాంబర్ సెక్రటరీ కనుమూరి సీతారామరాజు, ఇనుకొండ రంగారావు, వేగేశ్న రంగరాజు, దేవరపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● క్షేత్రంపై మేఘం.. ఆహ్లాదభరితం



ఆకాశం నిండా మబ్బులతో ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం ఆహ్లాదభరితంగా మారింది. ఆదివారం సాయంత్రం వాన కురవడానికి ముందు నల్లని కారుమబ్బులు ఆలయ పరిసరాలను కమ్మేశాయి. దీంతో ఇక్కడ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. భక్తులకు కనువిందు చేసింది.

– ద్వారకాతిరుమల

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ కొలువు

భీమవరం/తాడేపల్లిగూడెం: ఇంటర్మీడియెట్‌తో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 75 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంటర్మీడియెట్ బోర్డు, హెచ్‌సీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, వృత్తి విద్యా కోర్సులు చదివిన వారు అర్హులని తెలిపారు. జిల్లాలో సుమారు 300 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఆగస్టు 1న ఉదయం 9 గంటలకు తాడేపల్లిగూడెంలో జూనియర్ కళాశాలలో ఎంపిక ప్రక్రియ చేపడతామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాది శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.10 వేల చొప్పున స్టయిఫండ్, శిక్షణ పూర్తి కాగానే హెచ్‌సీఎల్ టెక్నో కంపెనీలో ఫుల్ టైం ఉద్యోగం ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 96429 73350లో సంప్రదించాలని కలెక్టర్ నాగరాణి కోరారు.

బహుళజాతి సంస్థలపై నియంత్రణ అవసరం



మాట్లాడుతున్న డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశమంతా ప్రతి వస్తువు అమ్మకం ధర ఒకే విధంగా ఉండాలని, బహుళ జాతి సంస్థల వ్యాపారాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ మేరకు చట్టాలు చేయాలని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణ అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక మర్చంట్స్ కళ్యాణ మండపంలో రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ మాట్లాడుతూ మాల్స్ ద్వారా ప్రతి వస్తువును మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు వినియోగదారులకు అందిస్తూ కార్పొరేట్ సంస్థలు ఆకర్షిస్తున్నాయన్నారు. దీనివల్ల దేశంలో కిరాణా దుకాణాలు మాయమైపోతాయన్నారు. దీనిపై అసోసియేన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దాలి సీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి కిరాణా వ్యాపారిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ప్రజలకు చేరువయ్యే వస్తువుల నాణ్యతపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎంటీవీ సత్యకుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కిరాణా వ్యాపారులతో పాటు డిస్ట్రిబ్యూటర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జాతీయ నాయకత్వం దృష్టి సారించాలన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరుకాగా అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ఎస్ఎన్ మూర్తి, శ్రీరామ్ గుప్తా, నేరెళ్ల రాజా, ఎస్.గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిషేధించాలి



మాట్లాడుతున్న మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, సభ్యులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో మద్యపానం, మత్తు పదార్థాలను నిషేధించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకూ పసిపాపలు, బాలికలు, మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారం చేపట్టిన 100 రోజుల్లో రాష్ట్రంలో శాంతిభద్రతలు నియంత్రిస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారని గుర్తుచేశారు. ఆ దిశగా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల విజయనగరం, ఏలూరు జిల్లా కుక్కనూరులో జరిగిన సంఘటనలు ఆందోళనలు కలిగిస్తున్నాయన్నారు. మద్యం మత్తులో అఘాయిత్యానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని హోంమంత్రి తెలిపారన్నారు. ఇటువంటి అఘాయిత్యాలకు కారణమైన మద్యాన్ని, మత్తు పదార్థాలను నిషేధించాలని కోరారు. మద్యాన్ని ఆదాయ వనరుగా చేసి ఖజానాను నింపుకోవడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరకా శ్యామల, మన్నవ యామిని పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ


చెస్ పోటీల విజేతలను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: గత రెండు రోజులుగా భీమవరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్–11 చదరంగ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 180 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానంలో ఎ.వర్షన్(నెల్లూరు), రెండో స్థానంలో పి.మిథిలేష్ (నెల్లూరు) నిలవగా, బాలికల విభాగంలో మొదటి స్థానంలో యశస్వి అనియ (అనంతపురం), హఫీసీస్ మహమ్మద్ (విశాఖపట్నం) విజేతలుగా నిలిచారని చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. వీరు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మెంటే పార్థసారధి, సునీల్ అగర్వాల్, కల్యాణ కుమార్, ఉదయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు మండలం కొమిరేపల్లి వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న దంపతులు గాయపడ్డారు. పెదవేగి మండలం దిబ్బగూడెం నుంచి ద్విచక్రవాహనంపై భీమడోలు వెళ్తున్న భార్యాభర్తల్ని రాజమండ్రి వైపు కారు కొమిరేపల్లి సమీపంలో ఢీకొట్టింది. ప్రమాదంలో దంపతులు రోడ్డుపై పడిపోయారు. చికిత్స నిమిత్తం పోలీసులు వారిని ఏలూరు వైద్యశాలకు తరలించారు.

ప్రమాదంలో వృద్ధురాలి మృతి


పీతల నాగమణి, మృతురాలు(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: లారీని తప్పించబోయి అదుపు తప్పి చెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు విద్యానగర్‌కు చెందిన విశాలి భీమవరం ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం భీమవరం నుంచి విశాలి, తల్లి పీతల నాగమణి (62) సొంత కారులో నిడదవోలు బయల్దేరారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి డ్రైవర్ చెట్టును ఢీకొట్టాడు. దీంతో నాగమణి అక్కడికక్కడే మరణించగా.. విశాలి, డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గిరిజనుడు మృతి

కొయ్యలగూడెం: అనుమానాస్పద స్థితిలో గిరిజనుడు మృతి చెందిన సంఘటన దిప్పకాయలపాడు పంచాయతీ బిల్లిమిల్లిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం బిల్లిమిల్లి గ్రామానికి చెందిన సోడెం వెంకటేశు(60) కూలి చేసుకునేవాడు. భార్య పదేళ్ల క్రితమే విడిచి వెళ్లిపోయింది. ఇద్దరు కుమారుల్ని తన వద్దనే ఉంచుకుని పెంచి పెద్ద చేశాడు. ఉదయం వెంకటేశు నివాసంలో రక్తపు మడుగులో మృతిచెంది ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించారు. అతని మెడపై బలమైన గాయం ఉందన్నారు. బలమైన ఆయుధంతో నరికి హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేస్తున్నట్లు పోలవరం సీఐ మధుబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

పాపికొండలు పులికింత

- పులి గాండ్రింపులతో అభయారణ్యంలో జీవ వైవిధ్యం
- నాలుగైదు పులులు ఉన్నట్లు అధికారుల నిర్ధారణ
- ప్రజల్లో చైతన్యంతో స్వేచ్ఛగా సంచరిస్తున్న వైనం
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

బుట్టాయగూడెం : పెద్ద పులి గాండ్రింపులతో పాపికొండలు పులకరిస్తోంది. ఒకప్పుడు టైగర్ రిజర్వ్‌లకు మాత్రమే పరిమితమైన బెంగాల్ టైగర్లకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని పాపికొండల అభయారణ్యం ఆవాసమైంది. జీవవైవిధ్యానికి ఆలవాలమైన ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా పెద్ద పులి జాడల్ని గుర్తించారు. తాజాగా నాలుగుకు పైగా పులులు, ఐదుకు పైగా చిరుతలు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, ప్రజల్లో పెరిగిన అవగాహనతో పెద్ద పులులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి.

ట్రాప్ కెమెరాకు చిక్కిన పులులు, చిరుతలు

పాపికొండలు అభయారణ్యం ఏలూరు, అల్లూరి, భద్రాది జిల్లాల అటవీ ప్రాంతాల మధ్య ఉంది. మొదట్లో 590 హెక్టార్ల పరిధిలో ఉన్న అటవీ ప్రాంతం మాత్రమే రిజర్వ్ ఫారెస్టుగా ఉండేది. 2008లో ఈ ప్రాంతాన్ని వన్యప్రాణి సంరక్షణ కోసం అభయారణ్యంగా గుర్తించారు. దీన్ని జాతీయ పార్కుగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 10,12,860 చదరపు కిలోమీటర్ల పరిధిలోని మూడు జిల్లాల్లో అటవీ ప్రాంతాల మధ్య 1,12,500 హెక్టార్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం


పాపికొండల అభయారణ్యంలో ట్రాప్ కెమెరాలకు చిక్కిన పెద్ద పులి


పాపికొండల అభయారణ్యంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుతలు

దీనిని జాతీయ పార్కుగా మార్చాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి ఈ అభయారణ్యంతో పాటు జంతు సంరక్షణపై ప్రభుత్వం, అటవీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

2022లో ట్రాప్ కెమెరాకు చిక్కిన పులి

2014లో అటవీ శాఖ అధికారులు తొలిసారి ఇక్కడ పులులు సంచరిస్తున్నట్టు గుర్తించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని తెల్ల దిబ్బలు తదితర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పులి గ్రాండింపులు విన్నట్టు ఆ ప్రాంత ప్రజలు చెప్పేవారు. 2009–10 మధ్య కాలంలో బుట్టాయగూడెం మండలం ఇనుమూరు, చింతలగూడెం, అంతర్వేదిగూడెం అటవీ ప్రాంతంలో పులుల అడుగులను అటవీ అధికారులు గుర్తించారు. 2019లో పులులు సంచరిస్తున్నట్టు గుర్తించిన అటవీ అధికారులు ఆ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక జారీ చేశారు. 2022లో పులుల గణన కార్యక్రమంలో పులుల జాడ ట్రాప్ కెమెరాకు చిక్కింది. పాపికొండల అభయారణ్యంలో నాలుగుకు పైగా పులులు, ఐదుకు పైగా చిరుత పులులు సంచరిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఒక పెద్ద పులి పోలవరం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, నల్లజర్ల మండలాల పరిధిలో పొలాల్లో సంచరించి రైతులను, ప్రజలను భయాందోళనకు గురిచేసింది.



ఒంటరిగానే పులుల జీవనం

పులులు సాధారణంగా ఒంటరిగానే జీవనం సాగిస్తాయి. పులి సంచరించే ప్రాంతాన్ని పెద్ద పులి టెరిటరీగా భావిస్తారు. ఆడ పులి తన నివాస స్థావరాన్ని సుమారు 20 చదరపు కిలోమీటర్ల మేర ఉండేలా ఎంచుకుంటుంది. మగ పులి 60 నుంచి 100 చదరపు కిలోమీటర్ల వరకు ఉండేలా తన నివాస స్థావరాన్ని ఎంచుకుంటుంది. పెద్ద పులి 18 నుంచి 20 సంవత్సరాలు బతుకుతుంది. ఆడ పులి దగ్గర పులి పిల్లలు మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకూ వేట, ఈత నేర్చుకుంటాయి. మగ పులి నాలుగేళ్ల తర్వాత తల్లి నుంచి వేరైపోతుంది. ఆడ పులి మాత్రం తల్లి దగ్గరే ఉంటుంది. ఆడ పులి గర్భం దాల్చిన 93 నుంచి 113 రోజుల్లో ప్రసవిస్తుంది. సాధారణంగా నవంబర్ – ఏప్రిల్ మధ్య పులుల పునరుత్పత్తి ఎక్కువగా ఉంటుందని జంతు పరిశోధకులు నిర్ధారించారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత

జీవ వైవిధ్యానికి ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పులులను కాపాడుకొనేందుకు అవి సంచరించే అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు 2010 నుంచి ఏటా జూలై 29న వరల్డ్ టైగర్స్ డే నిర్వహిస్తున్నారు. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన టైగర్ సమ్మిట్ నిర్ణయం మేరకు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుతున్నారు.

గుబ్బల మంగమ్మకు మొక్కులు చెల్లించిన భక్తులు


గుబ్బల మంగమ్మ గుడికి వెళ్ళే ప్రధాన ద్వారం గేటు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లి దర్శనాన్ని అధిక వర్షాల కారణంగా నిలిపివేశారు. ఆదివారం అనేక మంది భక్తులు మంగమ్మ తల్లి దర్శనం కోసం వాహనాలపై వచ్చారు. ఆలయ కమిటీ వారిని కామవరం సమీపంలో ఉన్న ప్రధాన గేటు వద్ద నిలిపివేయడంతో వచ్చిన భక్తులు ఆ గేటు వద్దే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కరుణించి కాపాడాలని భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గోదావరిలో దూకిన వ్యక్తిని రక్షించిన జాలర్లు

నరసాపురం: గోదావరిలో దూకిన వ్యక్తిని రక్షించిన ఘటన ఆదివారం నరసాపురం వశిష్ట గోదావరి పడవలరేవు ప్రాంతంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ అప్పలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పొన్నపల్లి గోదావరితీరంలో ఉంటున్న కోలా కృష్ణ భార్యతో గొడవపడి ఎదురుగా ఉన్న గోదావరిలో దూకాడు. వరద ప్రవాహంతో ఉధృతంగా ఉన్న గోదావరిలో కొట్టుకుపోతుంటే వలంధర్‌రేవులో బందోబస్తు చేస్తున్న ఫైర్ స్టేషన్ కానిస్టేబుల్ బాల విజయభాస్కర్ గమనించి స్థానిక జాలర్లను అప్రమత్తం చేశాడు. జాలర్లు ఇంజిన్ నాటుపడవలో వెళ్లి కృష్ణను ఒడ్డుకు చేర్చారు. చికిత్స నిమిత్తం అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు సీఐ చెప్పారు.

విధి మిగిల్చిన విషాదం

- కాకినాడ జిల్లా రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అన్నదమ్ముల మృతి
- తాడేరు గ్రామంలో విషాద ఛాయలు

భీమవరం అర్బన్: బతుకుదెరువు కోసం వెళ్లిన ఆ ముగ్గురు అన్నదమ్ముల్ని విధి రోడ్డు ప్రమాదం రూపంలో బలిగొంది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. భీమవరం మండలంలోని తాడేరు గ్రామానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు తల్లితో కలిసి వేరే గ్రామానికి పని కోసం వెళ్లి తిరిగి వస్తుండగా కాకినాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో తాడేరు గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాలు ప్రకారం నంగలం కోటయ్య, నంగలం దుర్గకు రాజు (20), ఏసు (18), అఖిల్(10)లు కుమారులు. ఉన్న ఊళ్లో పనులు దొరకక భీమవరం వచ్చేశారు. పట్టణంలోని గునుపూడిలో 15 సంవత్సరాలుగా అద్దెకు ఉంటున్నారు. రాజు, ఏసు బడి మానేసి తల్లిదండ్రులతో పాటు కూలీ పనులకు వెళ్లేవారు. కొంత కాలంగా కోటయ్య మద్యంకు బానిసై భార్య, పిల్లల పోషణ పట్టించుకోకపోవడంతో తల్లి దుర్గ పిల్లలను తీసుకుని దూర ప్రాంతానికి పనులకు వెళ్లేది. రెండు వారాల క్రితం నర్సీపట్నం వెళ్లి పనులు చేసి పల్సర్ బైక్‌పై తల్లి, ముగ్గురు కుమారులు వస్తుండగా కాకినాడ జిల్లాలోని గండేపల్లి మండలంలోని మురారి శివారుకు వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో పడిపోయారు. వెనుక వస్తున్న వాహనం బలంగా ఢీకొట్టడంతో రాజు, ఏసు, అఖిల్ అక్కడికక్కడే మరణించారు. తల్లి దుర్గ గాయపడడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


అంబులెన్స్‌లో రాజు, ఏసు, అఖిల్ మృతదేహాలు

తాడేరులో విషాద ఛాయలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అన్నదమ్ములు రాజు, ఏసు, అఖిల్ మృతదేహాలను తాడేరు శ్మశాన వాటికలో ఖననం చేశారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృత్యువాత పడటంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక


బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

వీరవాసరం: వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పురుషుల, స్త్రీల బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 70 హాజరయ్యారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయక కార్యదర్శి పి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు తెలిపారు. మహిళ విభాగంలో బి.సౌమ్య శ్రీ, సీహెచ్ మానస, ఎం.మరియ, ఎస్.గౌరి, గులిపల్లి స్వాతి, కె.రాజశ్రీ, ఎంపిక కాగా.. పురుషుల విభాగంలో ఎస్. సాగర్, డి.విల్సన్, పి.అనోజ్, ఎ.ఆనంద్, పి.ఫణి, ఎం.దుర్గారావు ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు నెల్లూరు జిల్లా ఇందుకూరి పేటలో ఆగస్టు 2, 3, 4 తేదీల్లో జరిగే బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

బాలికను చావబాదిన టీచర్

టీచర్, ప్రిన్సిపాల్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఏలూరు టౌన్: విద్యాబుద్ధులు చెప్పి ఆదర్శంగా నిలవాల్సిన టీచరమ్మ ఆగ్రహంతో ఊగిపోయింది. ఏలూరులోని ఒక పాఠశాలలో 5వ తరగతి బాలికను చావబాదింది. దీంతో బాలిక తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఇంట్లో తండ్రి ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. తండ్రి రవికుమార్ స్కూల్‌కు వెళ్లి ప్రిన్సిపాల్, టీచర్‌ను ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు 19వ డివిజన్‌లో ఉంటున్న ఎం.రవికుమార్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె లిఖిత హార్ట్ పేషెంట్. అమీనాపేట సురేష్‌చంద్ర బహుగుణ పోలీసు ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 5వ తరగతి చదువుతోంది. ఈ నెల 24న స్కూల్లో హోంగార్డుగా పని చేస్తున్న రాజ్యలక్ష్మి క్లాస్‌లో పాఠాలు చెబుతోంది. లిఖిత పాఠాలు నోట్ చేసుకోవటంలో జాప్యం కావడంతో లిఖితను లేపి కర్రతో వాతలు తేలేలా కొట్టిందని బాధితులు తెలిపారు. బాలిక జ్వరంతో బాధపడుతూ నీరసంగా ఉండడంతో ఆరా తీయగా విషయం తెలిసింది. దీనిపై స్కూల్ ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా.. రాజ్యలక్ష్మిని పిలిచి ఎందుకు చేశావని అడిగారని.. 'నేనే చేశాను... ఏమి చేసుకుంటారో చేసుకోండి' అంటూ ఆమె నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిందని తెలిపారు. స్కూల్ ఉన్నతాధికారులకు విషయాన్ని చెప్పారు. స్కూల్ కమిటీ దృష్టికి తీసుకువెళ్ళాలని, రెండు రోజులు సమయం పడుతుందని ఉన్నతాధికారి సమాధానమిచ్చారని.. స్కూల్‌కు వచ్చి గట్టిగా అరిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని బెదిరించారని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ స్పందించి న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.

టీచర్, బాలిక తండ్రిపై కేసు నమోదు

ఈ సంఘటనపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. విద్యార్థినిని తీవ్రంగా కొట్టిన రాజ్యలక్ష్మిపై కేసు నమోదు చేశారు. న్యాయవాది రవికుమార్ స్కూల్లోకి అక్రమంగా ప్రవేశించి టీచర్, ప్రిన్సిపాల్‌ను దుర్భాషలాడి, అవమానపరిచారంటూ ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదుతో రవికుమార్‌పై కేసు నమోదు చేశారు.

ముంపు గ్రామాల పరిశీలన


తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో స్థానికులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్లు

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపు గ్రామాలైన నందమూరు, ఆరుళ్ళ, జగన్నాథపురంలో ఆదివారం ట్రైనీ కలెక్టర్లు శుభమ్ నోక్వాల్, డి.హిమ వంశీ, పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా కొంగువారిగూడెం నుంచి ఎంత నీరు వస్తుంది? ఆ నీరు గ్రామాల్లోకి ఎంత వచ్చింది? ఎన్ని ఎకరాలు ముంపునకు గురైంది వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆరోగ్య సదుపాయాలపై రెవెన్యూ సిబ్బందిని ఆరా తీశారు.

హరిశ్చంద్ర ప్రసాద్‌కు నివాళి


తణుకులో రక్తదానం చేస్తున్న ఆంధ్రా సుగర్స్ ఉద్యోగులు

తణుకు: దివంగత పారిశ్రామికవేత్త డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ 104వ జయంతి వేడుకలను ఆదివారం ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, డైరెక్టర్లు వీఎస్ రాజు, డాక్టర్ డి.మంజులత, పి.వెంకటేశ్వరరావు, జీఎస్‌వీ ప్రసాద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెండ్యాల ఎస్ఆర్‌వీకే రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, ముళ్లపూడి వెంకటరమణమ్మ మెమోరియల్ ఆసుపత్రి సౌజన్యంతో సుమారు 400 మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. 25 ఏళ్లకు పైగా సేవలందించిన 96 మంది ఉద్యోగులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. అనంతరం సంస్థ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) ఎ.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కార్యదర్శి పీవీఎస్ విశ్వనాథ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


సబ్ జూనియర్స్ జట్లకు ఎంపికైన బాలబాలికలు

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాల ఆవరణలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు తరలివచ్చారు. పోటీల్లో పాల్గొని ప్రతిభ, నైపుణ్యం చాటిన బాలబాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశామని అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీను, కోశాధికారి కె.మురళీకృష్ణ చెప్పారు. ఎంపికైన జట్లు ఆగస్టులో చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాన్నారు. బాలుర జట్టుకు జి.చార్లెస్ వెస్లీ, పి.అఖిల్ సాయినాథ్, ఐ.ఈశ్వర ప్రసాద్, బి.రిషిల్, జి.వేదనాథ్‌రెడ్డి, జి.దినేష్‌కుమార్, ఎస్.పునీత్, జి.దేవేంద్ర, వి.బాలసుబ్రహ్మణ్యం, పి.విశాల్ కార్తికేయ, జి.అనిష్‌చౌదరి, డి.కుశాల్ కుమార్‌తో పాటు స్టాండ్‌బైగా చిన్నభద్రరావు, ఆకాష్, సౌర్య, సాయియశ్వంత్‌రెడ్డి ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ఎం.యోగశ్రీ, పి.మహేశ్వరి, డి.సాయిశ్రీలాస్య, పి.శాంతిసులోచన, ఎం.నాగప్రణతి, జీహెచ్ రమణి, శివనాగ శ్రావణి, లతీఫ్, ఎస్.సాత్విక, ఖుషి, హేమశ్రీ, గీతాశరణ్య ఉన్నారు.

రాట్నాలమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ

దెందులూరు: పెదవేగి మండలం శ్రీరాట్నాలమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి ఆలయ అర్చకులు విశేషాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. పూజా రుసుంతో రూ.58,850, విరాళంతో రూ.17,040, లడ్డూప్రసాదం అమ్మకంతో రూ.13,500, ఫొటోల అమ్మకం వల్ల రూ.4,180 వచ్చిందని ఆలయ నిర్వాహణాధికారి తెలిపారు.

దిగుబడికి కాలిబాటలు

పాడి - పంట

గణపవరం: వరి పొలంలో కాలిబాటలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చాలా మంది రైతులు కాలిబాటలపై ఆసక్తి చూపడం లేదు., అదనపు ఖర్చులు, కాలిబాట మార్గంలో వరి నాట్లు తొలగించడం వల్ల దిగుబడి తగ్గుతుందన్న అపోహతో ఏర్పాటుకు దూరంగా ఉంటున్నారు. అయితే నాట్లువేసిన పొలంలో రెండు మీటర్ల దూరంలో కాలిబాటలు వేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

లాభాలు ఇలా..

కాలిబాటలతో మొక్క వేరు భాగానికి గాలి, సూర్యరశ్మి బాగా తగిలి చీడపీడల సమస్య తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందులు చల్లడానికి అనువుగా ఉంటుంది. కాలిబాటల వెంట తిరుగుతూ ఎరువులు, పురుగుమందులు చల్లితే ప్రతి వరిదుబ్బుకు అందించడానికి అనువుగా ఉంటుంది. దీంతో ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాల మేర అదనంగా దిగుబడి సాధించే అవకాశం ఉందని చెబుతున్నారు. చీడపీడల బెడద కొంతవరకూ తగ్గుతుంది. కలుపు తొలగించడానికి, తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తే సులభంగా గుర్తించడానికి, ఎలుకల నివారణకు అనువుగా ఉంటుంది. తుఫాన్‌లు, భారీ వర్షాలు వంటి పకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థంగా జరిగి దిగుబడి తగ్గకుండా కాలిబాటలు ఉపయోగపడతాయి. వ్యవసాయ సిబ్బంది కాలిబాటల ప్రయోజనాలు రైతులకు వివరించడంతో ఇటీవల బాటలు వేసే రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది.


వరిలో ఏర్పాటు చేసిన కాలిబాటలు

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ లేదా కొబ్బరి డొక్కుతాడు తీసుకుని చేను గట్టుకు ఒకవైపు నుంచి మరోవైపు గట్టుకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంట 12 సెంటీమీటర్ల వెడల్పున వరినాట్లు తొలగించాలి. ఈ నాట్లు పొలంలో పల్చగా ఉన్న ప్రాంతాల్లో నాటుకోవచ్చు. వెదజల్లే పద్ధతిలో సాగు చేసేవారు విత్తనాలు చల్లిన 15 రోజుల నుంచి 20 రోజుల వ్యవధిలో వరిమొక్కలు తొలగించి కాలిబాటలు వేసుకోవాలి.

ప్రయోజనకరం



రైతులు పొలంలో కాలిబాటలు తప్పనిసరిగా వేసుకోవాలి. దీనివల్ల లాభమే తప్ప నష్టం ఉండదు. ఎకరం పొలంలో కాలి బాటలు వేయడానికి రూ.800 నుంచి రూ.1000 వరకూ మాత్రమే ఖర్చు అవుతుంది. వీటివల్ల నాలుగైదు బస్తాల అదనపు దిగుబడి రావడమేకాక, కలుపు మొక్కల తొలగింపు, చీడపీడలు సకాలంలో గుర్తించడం, సస్యరక్షణ చర్యలు తీసుకోవడం, ఎలుకలవల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం వంటి ఉపయోగాలున్నాయి. నిర్వహణ ఖర్చులు ఎకరాకు రెండు నుంచి మూడువేల వరకూ రైతులకు మిగులుతుంది. **యర్రంశెట్టి ప్రసాద్, ఏవో, గణపవరం**

క్లుప్తంగా

ఘనంగా వాకర్స్ జిల్లా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వి.మురళీమోహన్‌రావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాకర్స్ జిల్లా కేబినెట్ సమావేశం ఆదివారం వాకర్స్ భవనంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి.మురళీమోహన్ రావు, జిల్లా గవర్నర్ వై.సత్యనారాయణ, మాజీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య సమక్షంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, క్లబ్ చేపట్టాల్సిన విధి విధానాలపై చర్చించారు. జిల్లా కార్యదర్శి వి.నాగేంద్ర ప్రసాద్, పట్టణ అధ్యక్షులు దూలం నాగరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిపూడి వెంకట కృష్ణారావు, డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, కోపల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ వార్షికోత్సవం



కళాకారులకు సత్కారాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం 44వ వార్షికోత్సవం స్థానిక భ్రమరాంబిక మల్లిఖార్జున విశ్వ బ్రాహ్మణ కళ్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికారాణి ఉడయార్, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, ఉపాధ్యక్షులు మాసా బాబూరావు, కొల్లి రమావతి, కర్రి ప్రభాకర్ బాలాజీ, ఏలూరి జగదీష్, కోశాధికారి తగరంపూడి యడవల్లి శశికుమార్ పర్యవేక్షించారు. డాక్టర్ నార్ని భావాజీలు హాజరై మాట్లాడారు. కళా ప్రదర్శనలు, జానపద గేయాలు, బుర్రకథ, భక్తి గీతాలు, అన్నమయ్య కీర్తనలు, నాటక దృశ్యాలు ప్రదర్శించారు.

గోడ పత్రిక ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దళిత సేన ఆవిర్భావ దినోత్సవ సభ ఈ నెల 29న ఉదయం 10 గంటలకు తాడేపల్లిగూడెం పట్టణంలోని మాగంటి కల్యాణ మండపంలో నిర్వహించనున్నామని, ఈ సభను జయప్రదం చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కడియద్దలో దళిత సేన నాల్గవ ఆవిర్భావ దినోత్సవ గోడ పత్రికను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు, జిల్లా కార్యదర్శి గెడ్డం సాల్మన్‌రాజు, మండల అధ్యక్షుడు ఉంద్రాజవరపు కృష్ణ, మండల మహిళా అధ్యక్షురాలు పద్మ, దళిత సేన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు చేల పరిశీలన



ముంపుబారిన పడిన పంటచేలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అత్తిలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంటచేలను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం పరిశీలించారు. అత్తిలి మండలం మంచిలి, ఆరవల్లి, దంతపల్లి, కంచుమర్రు, స్కిన్నెరపురం, ఈడూరు, కొమ్మర, పాలూరు గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించి ముంపులోని వరినాట్ల పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. రానున్న వేసవిలో రీసిల్టింగ్ చేసే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, మాజీ ఏఎంసీ ఛైర్మన్‌లు దాసం బాబ్జి, పోలిశెట్టి చంటి, మాజీ ఎంపీపీ కేతా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భీమవరం: ప్రేమించి పెళ్లిచేసుకున్న భర్త వ్యసనాలకు బానిసై వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన వలవల నందిని అదే ప్రాంతానికి చెందిన వలవల సాయిదుర్గ మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లు కాపురం సజావుగా సాగిన తరువాత మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసైన సాయి దుర్గ నిత్యం భార్య నందినిని వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గండితో ప్రజలకు గండం



వరద నీటి కోసం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై తవ్విన గండి



దువ్వలో వయ్యేరు వరద కారణంగా దెబ్బతిన్న వరిపైరు

- ఆర్‌అండ్‌బీ రోడ్డుపై తవ్విన గండి
- తూరల ఏర్పాటులో వివాదం



గండిలో తూరలు ఏర్పాటు చేస్తున్న రైతులు

తణుకు టౌన్: ఎర్రకాలువ వరద కారణంగా తణుకు మండలం దువ్వ ఉంద్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పడిన గండి ప్రజలకు గండంగా మారింది. దీంతో రెండు జిల్లాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎర్ర కాలువ వరద నీరు తణుకు మండలం దువ్వలోని వయ్యేరులోకి ప్రవహించడంతో దువ్వ సూర్యారావుపాలెం గ్రామాల వద్ద ఎర్రకాలువ గట్లపై నుంచి వరదనీరు ప్రవహించి పంట పొలాలను వరదనీరు ముంచెత్తింది. దీంతో దువ్వ, సూర్యారావుపాలెం, తేతలి, మండపాక శివారు ఎర్ర నీలిగుంట గ్రామాల్లోని సుమారు 3120 ఎకరాల వరి పంట నీట మునిగింది. ఎర్ర కాలువ నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో పంట పొలాల్లోని వరద నీరు వెనక్కి పంపే క్రమంలో రైతులు దువ్వ, సూర్యారావుపాలెం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రెండు రోజుల క్రితం గండి కొట్టారు. రెండు రోజులుగా పొలాల్లోని వరద నీరు క్రమంగా దువ్వ వయ్యేరులోకి వెళుతుంది. అయితే ఈ గండి కారణంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని దువ్వ నుంచి తూర్పు గోదావరి జిల్లా ఉంద్రాజవరం మండలంలోని కాల్దరి, సూర్యారావుపాలెం, పసలపూడి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేలివెన్ను, తణుకు, తాడేపల్లిగూడెంలలో కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఈ గండి కారణంగా ఇబ్బందులు ఏర్పడ్డాయి. ముందుగా వర్షపు నీరు, తర్వాత వరద నీరు ప్రవాహం కారణంగా నీట మునిగిన వరిపైరు కొంతమేర పూర్తిగా కుళ్లిపోగా మరికొన్ని పొలాల్లో వరిపైరు తేరుకుంటుంది. వరద నీరు పూర్తిగా తగ్గితే తప్ప ఎంతమేర పంట నష్టం జరిగిందోననే అంచనా వేయడం సాధ్యం కాదని వ్యవసాయ సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం వరినాట్లు పూర్తి కాకుండా దువ్వ వయ్యేరు వరద కారణంగా నాట్లు మునిగి దెబ్బతిన్న పొలాల్లో ప్రస్తుత సీజన్‌లో తిరిగి నాట్లు వేసే అవకాశం ఎంత వరకూ సాధ్యమవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి నాట్లు వేసేందుకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు మరలా అంతే మొత్తంలో ఖర్చు చేసేందుకు భారంగా మారుతుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయం భూ యజమానులు కాకుండా కౌలు రైతులే ఎక్కువగా సాగు చేస్తున్న తరుణంలో ఈ భారం కౌలు రైతులకు మరింత భారంగా మారుతుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం రైతులకు ఈ సీజన్‌లోనే నష్ట పరిహారం అందజేస్తే వచ్చే రబీ సీజన్‌లో పంటలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉంటారని పేర్కొంటున్నారు.

తూరల ఏర్పాటులో వివాదం

తణుకు: మండలంలోని దువ్వ, ఉంద్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామాల మధ్య రోడ్డు పునరుద్ధరణ వ్యవహారం వివాదాలకు దారి తీస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు తణుకు మండలం దువ్వ పరీవాహక ప్రాంతాల్లో వందల ఎకరాల్లో వరి చేలు ముంపునకు గురయ్యాయి. దీంతో వర్షపు నీరు తిరిగి వయ్యేరు వైపు లాగకపోవడంతో రైతులు రోడ్డును అడ్డంగా తవ్వేశారు. ఈ పరిస్థితుల్లో దువ్వ, సూర్యారావుపాలెం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉంటే శనివారం రాత్రి ముంపు ప్రాతాల పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చెంనాయుడు, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనితలు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. తక్షణమే పెద్ద తూరలు ఏర్పాటు చేసి రోడ్డు పునరుద్ధరించాలని ఆదేశించారు. అయితే ఈ ప్రాంతంలో పెద్ద తూరలు ఏర్పాటు చేస్తే వయ్యేరు వైపు ఉన్న చిన్న తూరల ద్వారా నీరు మళ్లించడం సాధ్యం కాదని రైతులు తేల్చి చెప్పారు. అయినప్పటికీ ఆదివారం సంబంధిత అధికారులు మూడు అడుగుల వెడల్పు తూరలను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం అవుతున్న క్రమంలో రైతులు అడ్డుకున్నారు. పాత తూరలనే తిరిగి ఏర్పాటు చేసి రోడ్డు పునరుద్ధరించడం వివాదానికి దారి తీసింది.

ఆషాఢం సారె సమర్పణ



గ్రామంలో భక్తుల ఊరేగింపు దృశ్యం

పెంటపాడు: ప్రత్తిపాడులో వేంచేసియున్న గ్రామ దేవతల ఆషాఢం సారె సమర్పణలో భాగంగా ఉదయం నుంచి సాయత్రం వరకు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రత్తిపాడు వై జంక్షన్ కనకదుర్గమ్మ, కాగులంపాడు రోడ్డులో కనక దుర్గమ్మ, ఆరుగొలను రోడ్డులో వేంచేసియున్న పైళ్లమ్మ, కృష్ణాయపాలెం రోడ్డులోని గండిపోచమ్మ, అంకాలమ్మలకు ఆషాఢం సారె సమర్పించారు. మహిళలు, ఆడపడుచుల ఆధ్వర్యంలో తీన్‌మార్ డప్పులు, బాణసంచాతో సారె ఉత్సవం ఊరేగింపు నిర్వహించారు. గ్రామ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మన్ కీ బాత్ కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సర్దార్ వల్లబాయ్ పటేల్ శక్తి కేంద్రంలో కేంద్ర అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 112 మన్ కీ బాత్ ఆన్‌లైన్‌లో వీక్షించే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నరిశే సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని దేశం కోసం చేస్తున్న సేవలను కొనియాడారు. సభ్యులు పుల్లా శ్రీనివాస్, పుల్లా సాయిరాం, జంగం నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ స్థానిక శాఖ వారిచే ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థినికి ఫీజ్ నిమిత్తం రూ.5000 అందజేశారు. వక్తలు మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని చెప్పారు. సంస్థ సభ్యులు, అధ్యక్షులు పత్స వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, కోశాధికారి యెగ్గిన శరత్, వై.ఆంజనేయ స్వామి, చేకూరి బంగ్రారాజు, శ్రీనివాసరాజు, గురుమూర్తి, పాండురంగారావు, తుమరాడ చిన్న, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



క్రీడాకారిణి తల్లిదండ్రులను సత్కరిస్తున్న మానవత సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న మానవత జిల్లా విద్యా కమిటీ ఛైర్మన్

తణుకు టౌన్: మానవత సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ప్రతీ ఒక్కరికీ భాగస్వాములు కావాలనే ఆలోచన వచ్చిందని మానవత రాష్ట్ర విస్తర్ణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి అన్నారు. ఆదివారం తణుకు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు మాట్లాడుతూ సమాజ సేవలో పాల్గొనే వారికి మానవత సంస్థ అనేక కార్యక్రమాలు చేస్తూ అనేక మందికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థిని తేజశ్రీకి మానవత సంస్థ సభ్యులు ఆచంట ఫణికుమార్ దంపతులు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. పారిస్ ఒలింపిక్ క్రీడల్లో పాల్గొంటున్న తణుకు పట్టణానికి చెందిన దండి జ్యోతికశ్రీ తల్లిదండ్రులను సత్కరించారు. అదే విధంగా ఢిల్లీలోని మానవత వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా డాక్టరేట్ పొందిన తణుకు మానవత సంస్థ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అక్కాపంతుల బాలాజీ, మానవత విశాఖ సెంట్రల్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ కె.రాధా పుష్పావతిలను సత్కరించారు. మానవత మండల కమిటీ ఛైర్మన్ బోయపాటి రామలక్ష్మి, కో ఛైర్మన్ వీవీ రామకృష్ణారావు, జిల్లా ఛైర్మన్ ఎస్వీ సతీష్ బాబు, కార్యదర్శి బి.రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీ, కె.రాజ రాజేశ్వరరావు, డాక్టర్ బి.రామలక్ష్మి పాల్గొన్నారు.

మానవతతోనే ఉత్తమ సమాజం

పెంటపాడు: మానవత ద్వారానే ఉత్తమ సమాజం సాధ్యమవుతుందని, ఉమ్మడి జిల్లా మానవత విద్యాకమిటీ ఛైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం బోడపాడులో సర్పంచ్ గేదల శివకుమార్, మానవత మండల అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, తదితరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ విద్యకు, కేరీర్ గైడెన్స్, స్కాలర్‌షిప్‌లు, తదితర సేవలు అందిస్తున్న మానవత సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీసీలకు కాసుల డిమాండ్

- టీసీ ఇప్పించండి మహా ప్రభో...
- ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల అవస్థలు
- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు
- ఫిర్యాదు చేయాలంటున్న విద్యాశాఖ అధికారి



తణుకు అర్బన్: అడ్మిషన్ కావాలా అయితే రండి రండి అంటూ గౌరవ పూర్వక పలకరింపులు.. అదే టీసీ కావాలని వెళ్తే రెండు రోజులు ఆగి రండి చూద్దాం అంటూ ముఖం చాటేస్తున్న వైనం. ఇదీ తణుకు నియోజకవర్గంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల పనితీరు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు టీసీ ఇచ్చేందుకు కూడా రుసుము చెల్లించాల్సిందేనంటూ డిమాండ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. వేసవి సెలవుల అనంతరం విద్యా సంవత్సరం పునఃప్రారంభించి రెండు నెలలు కావస్తున్నా విద్యార్థులు వారి అభిరుచి మేరకు గతేడాది చదివిన పాఠశాలల నుంచి మరొక పాఠశాలలకు మారుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే స్తోమత లేక కొందరు, మెరుగైన ప్రైవేట్ పాఠశాలలో చేర్పించేందుకు మరికొందరు తల్లీతండ్రులు ప్రస్తుత పాఠశాలల్లో టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) కోసం తమ పనులు మానుకొని పాఠశాలల చుట్టూ తిరుగుతున్నారు. కానీ కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు టీసీలు ఇవ్వడానికి తిప్పుతున్నారని తల్లి తండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పిల్లలను వేరొక పాఠశాలలో చేర్పించినా అనధికారికంగా విద్యనభ్యసించాల్సి వస్తుందంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తణుకు డీవైఈవో డి.మురళి సత్యనారాయణ సాక్షికి పలు వివరాలు వెల్లడించారు.

ఫిర్యాదు చేయండి



తల్లి తండ్రులు తమ పిల్లలను వారు ఇష్టపడిన చోట చదివించుకునే వెసులుబాటు ఉందన్నారు. ఫీజు బకాయిలు లేని విద్యార్థులకు అవసరమైనప్పుడు ప్రైవేట్ విద్యాసంస్థలు, అన్ని ప్రభుత్వ పాఠశాలలు తప్పనిసరిగా తల్లితండ్రుల అభ్యర్థన మేరకు టీసీ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. తల్లితండ్రులు కూడా గత బకాయిలు ఏమైనా పాఠశాలకు చెల్లించాల్సి ఉంటే వాటిని చెల్లించి టీసీ కోసం అర్జీ పెట్టుకోవచ్చని, అర్జీ పెట్టుకున్న వారం రోజులలోపు ఆయా యాజమాన్యాలు ఎటువంటి రుసుము తీసుకోకుండానే టీసీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. యాజమాన్యాలన్నీ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిబంధనలు పాటిస్తూ వారి భవితను మెరుగుపరిచే విధంగా నడుచుకోవాల్సిందేనని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా 96525 32611 నంబరులో తనను సంప్రదించాలని డీవైఈవో మురళీసత్యనారాయణ కోరారు.

– డీవైఈవో డి.మురళి సత్యనారాయణ

బోనాల సమర్పణ

అత్తిలి: ఆషాఢ మాసం సందర్భంగా అత్తిలిలో శ్రీ శక్తి మహంకాళీ పీఠం ఆధ్వర్యంలో అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఆదివారం అత్తిలి రామన్నపేట నుంచి మహిళా భక్తులు పోలేరమ్మ, విజయ ఛాముండేశ్వరీ ఆలయాలకు చేరుకుని బోనాలు సమర్పించారు. శ్రీ శక్తి మహంకాళీ పీఠం నిర్వాహకురాలు గాది మంగామణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్య సేవల కార్యక్రమంలో 7 గురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్‌చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో జనరల్ వైద్యులు నీలు మహేంద్రలు సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, పైడిపర్రు, కె.సావరం పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి పరీక్షించి, వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు ఎం.రవి రిజనాల్డ్ ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నూతన కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా ముత్యాలమ్మ



ముత్యాలమ్మను శాకంబరీదేవిగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మను ఆషాఢ మాస సందర్భంగా ఆదివారం కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా గర్భగుడిని, ఆలయ ప్రాంగణాన్ని, పాత ముత్యాలమ్మ ఆలయాన్ని నీరుల్లి కూరగాయల వర్తక సంఘం, విఘ్నేశ్వర హోల్‌సేల్ కూరగాయల వర్తక సంఘం, ఏఆర్ఎస్ వెజిటేబుల్స్ సురేష్, మాకా శ్రీనివాసరావు సౌజన్యంతో కూరగాయలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ ఈవో పి.హరేరాం ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి సారె సమర్పణ

భీమవరం: వాసవీ క్లబ్ చేస్తున్న సేవలతో పాటు సమాజ సేవలో ఆదర్శంగా ఉండాలని క్లబ్ జిల్లా గవర్నర్ వీఎల్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు, మిఠాయిలు, సుమారు 54 రకాలతో ఆషాఢమాస సారె సమర్పించారు. బీవీరాజు పార్కు నుంచి క్లబ్ సభ్యులతో కలిసి సారెతో ఊరేగింపుగా త్యాగరాజ భవనంలో వాసవీ ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించి పూజలు నిర్వహించారు. మునిసిపల్, రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద సిమెంట్ బెంచీలు, గోశాలలో దాణా, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముగింపులో భాగంగా కమిటీ సభ్యులు సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు ఇచ్చారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: పట్టణంలోని నెహ్రూకాలనీకి చెందిన 14 ఏళ్ల బాలుడు అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఏఎస్సై కె.శ్రీనివాస్ ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలుడు పేరం సత్యప్రకాష్ తన తాత పెన్ని ఏసుబాబు వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే ఏసుబాబు వద్ద కొంతనగదు మాయం కావడంతో సత్యప్రకాష్‌ను మందలించాడు. దీంతో ఆదివారం తెల్లవారుజామున తన పుస్తకాల బ్యాగ్‌తో అదృశ్యమైనట్లు ఏసుబాబు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలి



సెల్‌టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న స్థానికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 11వ వార్డు మహాలక్ష్మినగర్, 3వ వీధి శివారులో ఇరుకుగా ఉన్న ఇళ్ళ మధ్య ఖాళీ స్థలంలో సెల్ టవర్ నిర్మాణ నిమిత్తం జేసీబీతో పెద్ద గొయ్యి తవ్వారు. సమస్యను గుర్తించిన స్థానికులు సెల్‌టవర్ నిర్మాణం ఆపాలని కోరుతూ ఆదివారం సాయంత్రం ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత పర్మిషన్ లేకుండా ఇళ్ళ మధ్యలో సెల్‌టవర్ నిమిత్తం గొయ్యి తవ్వడంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ శామ్యూల్‌ను కలిసి సమస్యపై వినతిపత్రం అందించినట్లు చెప్పారు. మున్సిపల్ సిబ్బంది పరిశీలించి, నిర్మాణాన్ని ఆపాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇదే వ్యవహారంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణను సైతం కలిసి సమస్యను విన్నవించగా ఇళ్ళ మధ్యలో సెల్ టవర్ నిర్మించరాదని, నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అప్పుడు ఆగిన నిర్మాణ పనులు రెండు రోజులుగా తిరిగి ప్రారంభించడంతో తాము ఆందోళన చెందుతున్నామని చెప్పారు. సెల్ టవర్ ఇళ్ళ మధ్యలో ఉంటే రేడియేషన్ వస్తుందని, పిల్లలు, పెద్దలు, గర్భిణీలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు వస్తాయని వెను వెంటనే నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. స్థల యాజమాని పట్టణంలో మరోచోట నివాసం ఉంటారని, ఆయనకు ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలో నిర్మాణం చేపట్టారని, సెల్‌టవర్ నిర్మాణం తక్షణమే ఆపాలని స్థానికులు కోరుతున్నారు. తంగెళ్ల మురళీకృష్ణ, షేక్ లాల్ భాషా, మల్లిడీ నాగ శేఖర్ రెడ్డి, మణి, వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం తణుకులోని మెడికల్ అసోసియేషన్ భవన్‌లో స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా స్వర్ణ కార సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పట్నాల శేషగిరిరావు, నల్లగొండ వెంకట రామకృష్ణల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలో తణుకు పట్టణంలోని స్వర్ణకార సంఘానికి మొత్తం 395 మంది ఓటర్లు ఉండగా వారిలో 382 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అధ్యక్షుడిగా నాగుమల్లి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా కోరుమిల్లి సుబ్బారావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలలో ఓటమి పాలైన అధ్యక్ష అభ్యర్థి రామాచారి 20 సంవత్సరాలుగా తణుకు స్వర్ణ కార సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం సభ్యులు కీర్తి శివ ప్రసాద్, గురజాపు శ్రీనివాసరావు, గొల్తి రవినాథ్, నాగుమల్లి గణేష్, పొడుగు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోచ్‌కు సత్కారం



కోచ్ సీతారామయ్యను సత్కరించిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు

తణుకు అర్బన్: ప్యారిస్ ఒలింపిక్స్‌లో అథ్లెటిక్ విభాగంలో పాల్గొననున్న తణుకు క్రీడాకారిణి దండి జ్యోతికశ్రీకు శిక్షణనిచ్చిన కీర్తిశ్రీ కోచింగ్ సెంటర్ కోచ్ కట్లపర్తి సీతారామయ్యను ఆదివారం చిట్టూరి ఇండోర్ స్టేడియం క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో కోచ్ సీతారామయ్య వద్ద శిక్షణ తీసుకున్న జ్యోతికశ్రీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో వరల్డ్ అథ్లెటిక్స్ 400 మీటర్లు టర్కీలో పాల్గొంటున్న ఘనత సీతారామయ్యకే దక్కుతుందన్నారు. వచ్చే నెల 9న 400 మీటర్ల రిలేలో పాల్గొనే జ్యోతికశ్రీ ఒలింపిక్స్ పతకం తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు వర్మ, రమేష్, చేశెట్టి లలితాశంకర్, రాజేష్, నాని, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమస్యలు పరిష్కరించాలి



డీవైఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భీమవరం అర్బన్: విద్యా వ్యవస్థలో అపరిష్కృతంగా ఎన్నో సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు కోరారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం డీవైఈఓ ఎన్.శ్రీనివాసరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణల వల్ల అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వాసం సడలిపోతోందని, పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం మేల్కొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు.